క్లుప్తంగా

పీహెచ్‌సీ తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి వెంకటరమణ

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సోమవారం జిల్లా వైద్యాధికారి వెంకటరమణ తనిఖీ చేశారు. రోగులకు అందిస్తున్న వైద్యసేవలు, రికార్డులను పరిశీలించారు. వేసవిలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను గ్రామాల్లో అవగాహన కల్పించాలని, ఎండ తీవ్రతకు గురికాకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో చందు, సిబ్బంది ఉన్నారు.

వక్ఫ్ చట్టంతో న్యాయం


మాట్లాడుతున్న చంద్రారెడ్డి

గన్నేరువరం: పేద, మధ్యతరగతి ముస్లిం ప్రజలకు లబ్ధి చేరేలా వక్ఫ్ చట్టాన్ని ప్రధాని మోదీ రూపొందించారని బీజేపీ సీనియర్ నాయ కుడు ఏలేటి చంద్రారెడ్డి అన్నారు. గన్నేరువరంలో సోమవారం మండల అధ్యక్షుడు తిప్పర్తి నికేశ్ ఆధ్వర్యంలో వక్ఫ్ చట్ట సవరణ 2025 జనజాగరణ అభియాన్ మండల కార్యశాల నిర్వహించారు. నాయకులు విలాసాగరం రామచంద్రం, గాదే వెంకన్న, బండి తిరుపతి, అటికం రామచంద్రం, మచ్చ బాలరాజు, అటికం రమేశ్, వీరవేణి రమణ, బుర్ర చంద్రశేఖర్, బుర్ర ప్రశాంత్, బుర్ర నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. 8 మందికి గాయాలు

సైదాపూర్: సోమారం శివారులో సోమవారం ప్యాసింజర్ ఆటో బోల్తా పడి 8 మందికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. చిగురుమామిడి మండలం రేకొండ గ్రామానికి చెందిన పది మంది ప్యాసింజర్ ఆటోలో సోమారం మీదుగా హుజూరాబాద్ వెళ్తున్నారు. సోమారం శివారులో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. 8 మందికి గాయాలయ్యాయి. వెంటనే 108లో హుజూరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఆరుగురిపై కేసు నమోదు

జమ్మికుంట: కాంపౌండ్ నిర్మాణం కూలగొట్టిన ఘటనలో ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ రవి సోమవారం తెలిపారు. మండలంలోని శాయంపేట గ్రామానికి చెందిన రాసపల్లి సునీత అనే మహిళ ఇల్లు నిర్మించుకుంటుండగా, అదే గ్రామానికి చెందిన రాసపల్లి కొమురమ్మ, రాసపల్లి లక్ష్మణ్, స్వరూప, విజయ్‌కుమార్, శ్రీనాథ్,అరుణ అనే ఆరుగురు ఇంటి కాంపౌండ్, చేదబావిని కూలగొట్టి, బూతులు తిట్టారు. దీంతో బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ వివరించారు.

ముగిసిన క్రికెట్ పోటీలు


విజేత జట్టుకు నగదు అందజేస్తున్న శ్రీనాథ్‌రెడ్డి

గన్నేరువరం: మండలంలోని గునుకుల కొండాపూర్‌లో జరుగుతున్న ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు సోమవారం ముగిశాయి. ఫైనల్ మ్యాచ్ గునుకులకొండాపూర్, కల్లెపల్లి గ్రామాల మధ్య జరుగగా కల్లెపెల్లి విన్నర్ నిలిచింది. విన్నర్ జట్టు కల్లెపల్లికి మొదటి బహుమతి రూ.20 వేలు, రన్నర్ జట్టుకు రూ.10 వేల నగదును యువజన కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి బొడ్డు సునీల్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు తాళ్లపల్లి రవికుమార్‌గౌడ్, ఏఎంసీ డైరెక్టర్ న్యాలపట్ల కనుకయ్యగౌడ్, మాజీ సర్పంచులు సుదగోని మల్లేశంగౌడ్, చింతలపల్లి నర్సింహారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, దుడ్డు మల్లేశం, దొమ్మటి మల్లయ్య, లింగంపల్లి హరీష్, దొంగల ప్రదీప్, తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, నాగపూరి శంకర్‌గౌడ్, హన్మండ్ల నర్సయ్య, కొంకటి నర్సయ్య, న్యాలపట్ల రాజయ్య, క్రీడాకారులు దొమ్మటి అజయ్, రాకేశ్, మహేశ్, శ్రీనివాస్, అరవింద్, సమీర్, పాల్గొన్నారు.

పేకాటస్థావరంపై దాడి

శంకరపట్నం: మండలంలోని తాడికల్ శివారులో సోమవారం పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించినట్లు కేశవపట్నం ఎస్సై రవి తెలిపారు. పేకాడుతున్న ఆరుగురిని పట్టుకుని, రూ. 8,400 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

దివాలా నుంచి లాభాలబాట

- స్థిరాస్తుల సృష్టితో వెన్కెపల్లి సహకార సంఘం ఆదర్శం
- రూ.3కోట్లతో నూతన భవనం..
- షాపింగ్‌కాంప్లెక్స్, ఫంక్షన్‌హాల్ నిర్మాణం
- నేడు ప్రారంభించనున్న మంత్రి పొన్నం ప్రభాకర్


వెన్కెపల్లి-సైదాపూర్ విశాల సహకార సంఘం భవనం, ఫంక్షన్ హాల్

సైదాపూర్: మండలంలోని వెన్కెపల్లి విశాల సహకార సంఘం.. ఒకప్పుడు మూతపడే స్థితి. నేడు స్థిరాస్తుల సృష్టించుకునే స్థాయికి ఎదిగింది. ధాన్యం కొనుగోళ్లు.. ఎరువులు..విత్తనాల విక్రయాలతో లాభాలు గడించింది. ఒకప్పటి అవినీతి మరకలు.. రుణాల ఎగవేత పేరు నుంచి నేడు సిరులు కురిపించే స్థాయికి ఎదిగింది. 2016 నుంచి ధాన్యం కొనుగోళ్ల ద్వారా వచ్చిన కమీషన్, ఎరువులు, విత్తనాల విక్రయాల ద్వారా వచ్చిన కమీషన్ డబ్బులతో ఆర్థికంగా నిలదొక్కుకుంది. నేడు సహకార సంఘానికి పక్కా భవనం నిర్మించుకొని మంత్రి చేతుల మీదుగా ప్రారంభించేందుకు సిద్ధంగా ఉంది.

21 గ్రామాలు..

సైదాపూర్ మండలం వెన్కెపల్లి విశాల సహకార సంఘం పరిధిలో 21 గ్రామ పంచాయతీల్లో 2016 నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిర్వహిస్తోంది. ప్రతీ సీజన్‌లో రూ.లక్షల్లో కమీషన్ డబ్బులు సహకార సంఘానికి సమకూరుతున్నాయి. ఇలా ధాన్యం కొనుగోళ్లతోపాటు ఎరువులు, విత్తనాల విక్రయాలతో వచ్చిన ఆదాయంతో వెన్కెపల్లి సహకార సంఘం జిల్లాలోనే నంబర్ వన్‌గా నిలిచింది. నాబార్డు సహకారంతో రూ.1.44కోట్లు, సహకార సంఘం నిధులు సుమారు రూ.30లక్షలు మొత్తం రూ.1.74కోట్లతో వెన్కెపల్లి–సైదాపూర్ విశాల సహకార సంఘం నూతన భవనాన్ని, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించారు. అందులోనే రూ.1.30 కోట్లతో ఫంక్షన్ హాలు నిర్మించారు. ఈ రెండు భవనాలను నేడు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించనున్నారు.

ప్రారంభోత్సవానికి ముందే అద్దెకు..

ఫంక్షన్‌హాల్‌ను ప్రారంభించక ముందే అద్దెకు ఏడాదికి రూ.8.55లక్షలకు టెండర్ ద్వారా అప్పగించారు. సహకార సంఘం భవనంలో ఒక భాగం నిర్మించిన షెట్టర్‌లకు రూ.5వేలు చొప్పున కిరాయికి ఇచ్చినట్లు కార్యాలయ సీఈవో శ్రీధర్ తెలిపారు. అంతేకాకుండా సహకార సంఘం ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో గోదాంల మరమతు పనులు చేయించి, గోదాంలను ఉపయోగంలోకి తెచ్చారు. సంఘం ఆధ్వర్యంలో పెట్రోల్‌బంక్ నిర్మాణానికి స్థల సేకరణ వంటి కార్యాచరణ చేపట్టారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహిళలను కోటీశ్వరులను చేస్తానని ఎన్నికల్లో, ప్రభుత్వంలో ఎన్నోసార్లు చెప్పుకొచ్చారు. ఆ దిశగా నిర్ణయాలు తీసుకొని ఈ ఏడాది యాసంగి సీజన్‌కు మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సగం మహిళా సంఘాలకు అప్పగించారు. ఈమేరకు సహకార సంఘం ద్వారా సగం వరకు కేంద్రాలు నిర్వహించడంతో ఈ సీజన్ నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా వచ్చే ఆదాయం తగ్గుతోందని సహకారసంఘం సిబ్బంది, పాలకులు అంచనా వేస్తున్నారు.


విశాల సహకార సంఘం భవనం, షాపింగ్ కాంప్లెక్స్

సహకార సంఘం భవనంలోకి కేడీసీసీ బ్యాంక్?

విశాలంగా నిర్మించిన విశాల సహకార సంఘం భవనంలోకి కొత్త బస్టాండ్‌లో కొనసాగుతున్న కేడీసీసీ బ్యాంక్ కార్యాలయాన్ని తరలించాలని ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. కాగా బ్యాంక్ సిబ్బంది అభ్యంతరం తెలుపుతున్నట్లు తెలిసింది. ప్రస్తుతం ఉన్న భవనం బస్టాండ్‌కు సమీపంలో కావడంతో పెన్షన్ తీసుకునే వృద్ధులకు, రైతులకు, మహిళాసంఘాల సభ్యులకు అందుబాటులో ఉంటుందనే అభిప్రాయం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ విషయం బ్యాంక్ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లినట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. ఇప్పట్లో బ్యాంకు తరలింపు ఉండకపోవచ్చని పలువురు అధికార పార్టీ నాయకులు పేర్కొంటున్నారు.

విద్యార్థులకు అభినందన

మానకొండూర్: ఇంటర్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించిన మానకొండూర్ మండలం పోచంపల్లి మోడల్ స్కూల్ విద్యార్థినులు పిల్లి అంజలి, బాకారపు రక్షితను ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సోమవారం అభినందించారు. సీఈసీలో పిల్లి అంజలి 492, రక్షిత బైపీసీలో 434 మార్కులు సాధించగా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్ పెరుమాళ్ అభినందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి, గన్నేరువరం, ఇల్లంతకుంట మండల పార్టీ అధ్యక్షులు ముస్కు ఉపేందర్ రెడ్డి, కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, పార్టీ నాయకులు కొండ్ర సురేశ్, శ్రీనివాస్ గౌడ్, కొమ్మెర రవీందర్ రెడ్డి, మాచర్ల అంజయ్య, కొత్త తిరుపతిరెడ్డి, ఉపాధ్యాయులు, ఇన్‌చార్జిలు బి.శ్రీనివాస్, తిరుపతిగౌడ్, శ్రీరాం శ్రీనివాస్, డాక్టర్ సుమన్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

సర్కారు బడిలో చేరండి

గంగాధర: సర్కారు బడిలో చేరి మెరుగైన విద్య, ప్రభుత్వ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ ఉపాధ్యాయులు సోమవారం ప్రచారం నిర్వహించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా మల్లాపూర్, నడింపల్లి, గోపాల్‌రావుపల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. మే 1 నుంచి 10 వరకు మల్లాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉచిత యోగా క్యాంపు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. హెచ్‌ఎంలు అంజిరెడ్డి, రాజేశం, ఉపాధ్యాయులు రవీందర్‌రెడ్డి, ఎ.అంజిరెడ్డి, వెంకటరమణారావు, మమత, సీఆర్‌పీలు, విద్యార్థులు పాల్గొన్నారు.


ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

ఇందిరమ్మ ఇళ్ల అర్హుల జాబితా పరిశీలన

జమ్మికుంట: జమ్మికుంట మండలంలోని ఇందిరమ్మ కమిటీ సూచించిన అర్హుల జాబితాను మండల స్థాయి వెరిఫికేషన్ ఆఫీసర్లు ఎంపీవో వెంకటేశ్వర్లు, వెటర్నరీ సర్జన్ విజేందర్‌రావు ఆధ్వర్యంలో సోమవారం పరిశీలించారు. మండలంలోని బిజిగిరిషరీఫ్, పాపక్కపల్లి గ్రామాల్లో 27 , మడిపల్లి గ్రామాల్లో 30 మంది లబ్ధిదారుల నివాస పరిస్థితి, నిర్మాణ స్థలం, వివరాలు సేకరించారు. ఈనెల 30వ తేదీలోపు పరిశీలన పూర్తి చేయాలని ఆదేశాలు ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మడిపల్లి, పాపక్కపల్లి కార్యదర్శులు అంజిరెడ్డి, నరేందర్, లబ్ధిదారులు పాల్గొన్నారు.


లబ్ధిదారుల వివరాలు సేకరిస్తున్న పరిశీలన అధికారి విజేందర్‌రావు

సీడ్ కంపెనీలపై చర్యలు తీసుకోవాలి

హుజూరాబాద్: రైతులను నిలువు దోపిడీ చేస్తున్న సీడ్ కంపెనీ యజమాన్యాలపై వ్యవసాయ శాఖ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని ప్రెస్ క్లబ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర ఇవ్వకుండా రైతులను సీడ్ కంపెనీ యజమానులు మోసం చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘం నాయకులు రావుల భాస్కర్‌రెడ్డి,గూడూరు మల్లారెడ్డి, పోరెడ్డి కిషోర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత


చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే

మానకొండూర్ రూరల్: ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. తహసీల్దార్ రాజేశ్వరి, ఎంపీడీవో వరలక్ష్మి, మండల నాయకులు పాల్గొన్నారు.

తాడికల్ శివారులో కారు బోల్తా

శంకరపట్నం: మండలంలోని తాడికల్ గ్రామ శివారులో సోమవారం కోసిన వరిపొలాల్లో కారు బోల్తాపడింది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. గోదావరిఖనికి చెందిన అన్నదమ్ములు వరంగల్ భద్రకాళి దర్శనం కోసం కారులో బయలుదేరారు. వీరు ప్రయాణిస్తున్న కారు తాడికల్ శివారులో అదుపు తప్పి వరిపొలాల్లో బోల్తాపడింది. గమనించిన వాహనదారులు, స్థానికులు బోల్తాపడిన కారును సరి చేశారు. ఈ ప్రమాదంలో కారు ధ్వంసం కాగా అన్నదమ్ములు క్షేమంగా ఉన్నట్లు తెలిపారు. ప్రమాద విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు.


పొలాల్లోకి దూసుకెళ్లిన కారు

అందని ఉపాధి కూలీ డబ్బులు


ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న రాజు

శంకరపట్నం: కూలీలకు ఉపాధిహామీ పనులు చేసినా కూలీ డబ్బులు అందక ఇబ్బంది పడుతున్నారని వ్యవసాయకార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్ల రాజు ఆరోపించారు. మండలంలోని ముత్తారంలో సోమవారం ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొన్ని రోజులుగా పనులు చేసినా డబ్బులు రాలేదని, గడ్డపార, పార ఇతర వస్తువులను ప్రభుత్వం అందించడం లేదన్నారు. అధికారులు స్పందించి కూలీ డబ్బులు ఖాతాలో జమచేయాలని డిమాండ్ చేశారు.

పహల్గాం మృతులకు నివాళి

జమ్మికుంట: కశ్మీర్ పహల్గాంలో మృతి చెందిన వారికి సోమవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో బేడ, బుడిగ జంగం కులాల జన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సిరిపాటి వేణు, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు తూర్పాటి లింగయ్య ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి, నివాళి అర్పించారు. సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వానరాశి జాన్, నాయకులు తూర్పాటి పోచాలు, మారయ్య, తూర్పాటి జంపయ్య, శంకర్, సమ్మయ్య, రవి, సాంబయ్య, పత్తి పాపరావు, పర్వతం కనుకయ్య, రాజేశ్, రావుల సమ్మయ్య, రేవెల్లి నివాస్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో నివాళి

హుజూరాబాద్: పహల్గాంలో ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద పట్టణ ఆర్యవైశ్య సంఘం, యువజన సంఘల ఆధ్వర్యంలో మృతులకు కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్పర్సన్ గందె రాధిక శ్రీనివాస్, యువజన సంఘం అధ్యక్షుడు నాగరాజు, సంఘం నాయకులు గర్రెపల్లి శ్రీనివాస్, పాలకృష్ణమూర్తి, కటుకం రేణిగుంట్ల, సురేశ్, శ్రీనివాస్, నార్ల శ్రీనివాస్, మాడిశెట్టి ప్రసాద్, వేణుగోపాల్, శిల రాజేంద్రప్రసాద్, గంగిశెట్టి ప్రభాకర్, శశిధర్ అక్కినపల్లి అనిల్, నారాయణ, కొలిపాక అనిల్, అక్కినపల్లి శ్రావణ్. హరిశంకర్ తదితరులున్నారు.


కొవ్వొత్తులతో నివాళి అర్పిస్తున్న జన సంఘం నాయకులు

కారుతో బైక్‌ను ఢీకొట్టిన ఘటనలో ఒకరిపై కేసు

జమ్మికుంట: కారుతో బైక్‌ను ఢీకొట్టిన ఘటనలో ఒకరిపై కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ రవి సోమవారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం జమ్మికుంట మండలంలోని మడిపల్లి గ్రామ శివారు వద్ద, ఇల్లందకుంట మండలం చిన్న కోమిటి పల్లి గ్రామానికి చెందిన తొడేటి రామస్వామి ఎండీ రఫీ అనే ఇద్దరు బైక్‌పై వస్తుండగా ఇల్లందకుంట మండలం కనగర్తి గ్రామానికి చెందిన వాడిజే వేణుకుమార్ అనే వ్యక్తి ఆదివారం రాత్రి కారుతో అజాగ్రత్తగా నడుపుకుంటూ వచ్చి కారుతో ఢీకొట్టాడు. దీంతో ఇద్దరికి తీవ్రగాయాలు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. బాధితుడి తోడేటి రామస్వామి మేనల్లుడు పబ్బు అనిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని వినతి



శంకరపట్నం: ఇందిరమ్మ ఇళ్లు మంజూరుచేయాలని మండలంలోని మొలంగూర్ గ్రామానికి చెందిన నిరుపేదలు సోమవారం మండలకేంద్రమైన కేశవపట్నంలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు లబ్ధిదారులను పక్కన పెట్టి, అనర్హులను ఎంపిక చేశారని ఆరోపించారు. భూములు లేని తమకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని నీలమ్మ, మంజుల, మహంకాళి, అర్చన, సురేశ్, కృష్ణ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. వీరికి టీడీపీ పార్లమెంట్ కన్వీనర్ మోరె ప్రభాకర్, బైరి తిరుపతి మద్దతు పలికారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

వీణవంక: కాంగ్రెస్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని, బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎక్కటి రఘుపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని వల్బాపూర్‌లో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ సభను ప్రజలు పెద్దగా పట్టించుకోలేదన్నారు. ప్రభుత్వంపై బీఆర్‌ఎస్ నాయకులు బురద చల్లడం సరికాదన్నారు. కేసీఆర్ మాటల్లో పసలేదని పేర్కొన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు.

సోనియా గాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం

సైదాపూర్: తెలంగాణకు ప్రథమ విలన్ కాంగ్రెస్ అని విమర్శించిన మాజీ సీఎం కేసీఆర్ వ్యాఖ్యలను ఖండిస్తూ, మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం మండలకేంద్రంలో సోనియా గాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అమరుల త్యాగాలను చూసి సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రం ఇస్తే, పదేళ్ల అధికారంలో ఉన్న మాజీ సీఎం కేసీఆర్ కాంగ్రెస్‌ను విమర్శించడం సరికాదన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొంత సుధాకర్, ఏఎంసీ చైర్మన్ దొంత సుధాకర్, సీనియర్ నాయకులు గుండారపు శ్రీనివాస్, చాడ కొండాల్‌రెడ్డి, మిట్టపల్లి కిష్టయ్య, మ్యాకల రవిందర్, మల్లయ్య, బానోత్ కిషన్‌నాయక్, విద్యాసాగర్‌రెడ్డి, కృష్ణమూర్తి, ఎన్‌ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు సాయికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వోను కలిసిన ఫార్మసిస్టులు


డీఎంహెచ్‌వోకు కృతజ్ఞతలు తెలుపుతున్న ఫార్మసిస్టులు

కరీంనగర్‌టౌన్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఫార్మసిస్టులుగా కొనసాగుతున్న వారిని ఫార్మసీ ఆఫీసర్స్‌గా రాష్ట్ర ప్రభుత్వం మార్చినందుకు ఫార్మసిస్టు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చిలుక మురళీధర్ నేతృత్వంలో ఫార్మసిస్టులు జిల్లా వైద్యాధికారి వెంకటరమణను సోమవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు సేవ అందించాలనే ఉద్దేశంతో ముందుకెళ్తున్నందున తాము వెన్నంటి ఉండి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల్లో భాగస్వాములం అవుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సురేష్ కళ్యాణ్, జిల్లా నాయకులు రాజమల్లు, రవి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కోర్టుకు హాజరైన కాంగ్రెస్ నాయకులు

హుజూరాబాద్: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, ప్రస్తుత ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఆధ్వర్యంలో ధర్నాలు, రాస్తారోకోలు చేస్తే అప్పటి కాంగ్రెస్ నాయకులపై కేసులు నమోదయ్యాయి. ఈ మేరకు సోమవారం పట్టణంలోని కోర్టుకు నాయకులు హాజరయ్యారు. హాజరైన వారిలో కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ దేశిని అయిలయ్య, కాంగ్రెస్ పార్టీ జమ్మికుంట పట్టణ మాజీ అధ్యక్షులు కసుబోజుల వెంకన్న, ఎండీ సలీం, ఎండీ అఫ్సర్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సొల్లు బాబు, హుజూరాబాద్ పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు యేముల పుష్పలత, అలేటి సుశీల, మహేశ్వరి, కొడెం రజిత ఉన్నారు.


హుజూరాబాద్ కోర్టు ఎదుట ఉన్న కాంగ్రెస్ నాయకులు

ఘనంగా రాజ్యాంగ పరిరక్షణ యాత్ర

చొప్పదండి: జై బాపు, జైభీమ్, జై సంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణయాత్రలో భాగంగా సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన యాత్రను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రారంభించారు. ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్, కాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ పార్టీ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్ రావు, ఏఎంసీ చైర్మన్ కొత్తూరి మహేశ్, కొండగట్టు ఉత్సవ సమితి చైర్మన్ ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, మున్సిపాలిటీ మాజీ చైర్మన్ గుర్రం నీరజ, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, నిజానపురం చందు, తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఓర్పుతోనే అనుకున్నది సాధించగలం


మాట్లాడుతున్న పురాణం మహేశ్వర శర్మ


శతచండీ మహాయాగం

విద్యానగర్(కరీంనగర్): ఓర్పు వహిస్తేనే అనుకున్నది సాధించగలమని శ్రీదుర్గాభవానీ ఆలయ ధర్మాధికారి, వేదపండితులు పురాణం మహేశ్వర శర్మ అన్నారు. నగునూర్‌లోని శ్రీదుర్గాభవానీ ఆలయంలో ఆలయ అష్టమ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం.శతచండీ మహాయాగాన్ని ప్రారంభించారు. గోపూజ, గురువందనం, గణేష్‌పూజ, పుణ్యాహవాచని, ఋత్విగ్వరణం, యాగశాల ప్రవేశం, గణేశ సహస్రమోదక హవనం తదితర పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తూ రోజూ సూర్యోదయాన్ని ఆస్వాధించాలంటే చీకటి రాత్రిని భరించాల్సిందేనన్నారు. రాముడు, కృష్ణుడు సైతం కష్టాలను ఓర్చుకుని అవతార పురుషులుగా ఖ్యాతి పొందారని తెలిపారు. ఈ పూజల్లో ఆలయ వ్యవస్థాపక చైర్మన్ వంగళ లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి వేములవాడ ద్రోణాచారి, దేసు ప్రదీప్, శీతల్, ఆలయ నిర్వహణ కమిటీ బాధ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కొత్త ఫీడర్ ప్రారంభం

కరీంనగర్‌రూరల్: విద్యుత్ అంతరాయాలను తగ్గించడానికి కరీంనగర్‌రూరల్ సబ్ డివిజన్ పరిధిలోని మొగ్దుంపూర్ సెక్షన్‌లో ఇప్పటివరకు ఉన్న ఫీడర్‌ను వేరు చేసి కొత్తగా 11కేవీ బ్రేకర్‌ను ఏర్పాటు చేశారు. సోమవారం విద్యుత్‌శాఖ ఎస్‌ఈ మేక రమేశ్‌బాబు, డివిజనల్ ఇంజినీర్ జంపాల రాజంలు కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఏడీఈ గాదం రఘు, ఏఈ నరేశ్, ప్రొటెక్షన్ ఎఈ తిరుపతి, సెక్షన్ విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.